దళిత వాడలు..గిరిజన గూడేలను సందర్శించండి..

- అక్కడ సమతా, సమానత్వం అర్థమవుతాయి
- రాందేవ్‌బాబాకు రాఘవులు హితవు
- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి భంగపాటు తప్పదు
- ప్రజా సమస్యలను పరిష్కరించటంలో కెసిఆర్ విఫలం : తమ్మినేని
- సిపిఎం అఖిల భారత ముసాయిదా రాజకీయ తీర్మాణం విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వామపక్ష నాయకులు ముచ్చింతల్‌లోని సమతామూర్తి విగ్రహాన్ని సందర్శించాలంటూ యోగా గురువు రాందేవ్‌బాబా వ్యాఖ్యానించారనీ, ముందుగా రాందేవ్‌బాబా దేశంలోని దళిత వాడలు, గిరిజన గూడేలను సందర్శించాలంటూ సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు సూచించారు. అలా చేస్తే మన దేశంలో ఎస్‌సి, ఎస్‌టిల పట్ల సమతా, సమన్యాయాలు ఎలా అమలవుతున్నాయో అర్థమవుతాయని తెలిపారు. రాందేవ్‌బాబా యోగా గురువు కాబట్టి... ఆ సబ్జెక్టు గురించే మాట్లాడితే బాగుండేదనీ, సమానత్వం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలోని దళితులు, గిరిజనులు వెనుకబడిన తరగతుల ప్రజలు వివక్షతో ఎన్ని రకాల వేధింపులు, వేదనకు గురవుతున్నారో తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. సనాతన ధర్మం పేరుతో మనువాదాన్ని తెస్తారా? అని ప్రశ్నించారు. రామానుజుడి సమానత్వ ధర్మాన్ని పాతిపెట్టి దాని స్థానంలో మనువాదం తీసుకురావటమే వారి ఉద్దేశమన్నారు. నిజమైన సమానత్వం దేవుడి దగ్గర కాదు.. మనుషుల దగ్గర ఉండాలని సూచించారు. దేశంలో అంతరాలు, అసమానతలు తొలగిపోవాలని ఆకాంక్షించారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చెరుపల్లి సీతారాములుతో కలిసి రాఘవులు మాట్లాడారు. సిపిఎం 23వ అఖిల భారత మహాసభ ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని వారు విడుదల చేశారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఫెథరల్ వ్యవస్థను నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం రాజకీయ విధానంపై అత్యంత ప్రజాస్వామికంగా పార్టీలోనూ, బైటకూడా చర్చ జరుగుతోందని చెప్పారు. సభ్యులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు తమ అభిప్రాయాలు తెలపొచ్చన్నారు. ఏప్రిల్ 6-10 వరకు కేరళలోని కన్నూరులో జరగనున్న జాతీయ మహాసభల్లో ముసాయిదాకు మార్పులు చేర్పులు చేసి తుది రూపమిస్తామని వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లనన్నింటినీ లోన్‌రూపంలోనూ, వాటిని వడ్డీ లేని రుణాలుగానూ ఇస్తున్నారని చెప్పారు. ఇదో గొప్ప ఘనకార్యంగా ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు 0.5 శాతం అప్పులు చేయాలంటే.. విద్యుత్ సంస్కరణలు అమలు చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే కెసిఆర్ మీటర్లు పెట్టం, విద్యుత్ సంస్కరణలు అమలు చేయమని చెబుతున్నారనీ, ఇది ఆహ్వానించాల్సిన విషయమేనన్నారు. రూ.35 వేల కోట్ల మేర ఎరువుల సబ్సిడీని తగ్గించారని చెప్పారు. అంతర్జాతీయంగా వాటి ధరలు పెరిగిపోతున్నాయని తెలిపారు. రాబోయే కాలంలో రసాయినక ఎరువుల ధరలు పెరిగే అవకాశముందన్నారు. ప్రభుత్వం మాత్రం సబ్సిడీలు పెంచాల్సిందిపోయి తగ్గించటమేంటని ప్రశ్నించారు. రైతులకు మద్దతు ధర ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకే ధాన్యాన్ని పండించొద్దని చెప్పారని గుర్తుచేశారు. బిజెపికి వ్యతిరేకంగా కెసిఆర్ ఒక్కరు మాట్లాడితే సరిపోదనీ, ప్రజామద్దతు కూడగట్టాలని సూచించారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని పేర్కొన్న అంశాలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. ఈ విషయంలో కావాలనే పక్షపాత ధోరణితో కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా కేంద్రాన్ని ప్రశ్నించటంలో, నిలదీయటంలో విఫలమయ్యారని తెలిపారు. బిజెపి పట్ల, దాని విధానాల పట్ల కఠినంగా ఉండాలని సూచించారు. అయితే కెసిఆర్ ఒక్కరే కేకలు పెడితే సరిపోదనీ, బిజెపి వ్యతిరేక శక్తులను కలుపుకుపోవాలని విజ్ఞప్తి చేశారు. అదే క్రమంలో రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక చర్యలు మానుకోవాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యను తామే పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. దరఖాస్తులు తీసుకున్నా.. వాటిని నేటికీ పరిశీలించలేదనీ, పోడు రైతులను తీవ్రంగా వేధిస్తున్నారని చెప్పారు. ఇలాంటి ద్వంద్వ విధానాలు మానుకోవాలని హితవు పలికారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవటం వల్లే బిజెపి ఇక్కడ పాగా వేసేందుకు కలలు కంటున్నదని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మత ఘర్షణలు సృష్టించేందుకు ఆ పార్టీ కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు.

విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి

- 'మన ఊరు-మన బడి'ని ఉద్యమ స్ఫూర్తిగా తీసుకోవాలి
- పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా నిధుల ఖర్చు
- ఏన్నారై విరళాలపై దృష్టి కేంద్రీకరించాలి
- జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యా వ్యవస్థను మరింతగా పటిష్టపరిచేందుకు వీలుగా ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తిగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రులు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కోర్ట్ హాల్ నుంచి మనఊరు - మనబడి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, జిల్లా పరిషత్ చైర్మెన్లు, విద్యాశాఖ అధికారులతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. తొలి విడతగా మూడో వంతు పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమం ద్వారా 60 శాతం మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం అమలైన బడుల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేపడుతూ, అదనపు తరగతి గదుల నిర్మాణాలు, ల్యాబరేటరీ, లైబ్రరీ, ప్రహరీ, కిచెన్ షెడ్స్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, నీటి వసతి, విద్యుత్, ఫర్నీచర్, డిజిటల్ విద్యా బోధనకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. తొలి దశలో 3497 కోట్ల రూపాయలతో 9123 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ బడులను సందర్శించాలని కలెక్టర్లకు సూచించారు.

అత్యధికంగా 790 మంది మొదలుకుని వంద మందికిపైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలను తొలి విడత జాబితాలో ఎంపిక చేయాలన్నారు. పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయాలని, ఎస్ఎంసీ చైర్మెన్‌లతో పాటు సర్పంచ్, ప్రధానోపాధ్యాయుడు, ఇంజినీరింగ్ విభాగం ఏఈ సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మెన్లతో పాటు జడ్పీటీసీలు, గ్రంథాలయాల చైర్మెన్లు తదితర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని సూచించారు. విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చే ఎన్ఆర్ఐలు, పూర్వ విద్యార్థులు, ఇతర దాతలను ప్రోత్సహించాలని, వారి ఆర్థిక సహకారంతో బడులను మరింతగా అభివృద్ధి చేసుకోగల్గుతామన్నారు. ఎవరైనా పాఠశాలకు రూ.పది లక్షలు విరాళం ఇస్తే.. తరగతి గదికి వారి పేరు పెట్టొచ్చని, 25 లక్షలు విరాళం అందిస్తే ఓ విభాగం మొత్తానికి వారి పేరు పెట్టాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ మాట్లాడుతూ.. మన ఊరు - మన బడి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, పనులను గ్రౌండింగ్ చేసే సమయానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, సన్నద్ధమై ఉంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణ, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్, కమిషనర్ దేవసేన, జడ్పీ చైర్మెన్ అనిత హరనాథ్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, జడ్పీ సిఇఒ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

వస్త్రధారణ పేరుతో చదువుకు దూరం చేయొద్దు

ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం : డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వస్త్రధారణ పేరుతో అమ్మాయిలను చదువుకు దూరం చేయడం దారుణమని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు అన్నారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు ఎ.విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడారు. కర్ణాటక ఉడిపి ప్రాంతంలో వస్త్రధారణ పేరుతో ముస్లిం అమ్మాయిలను విద్యాసంస్థలకు రానివ్వకపోవడం దారుణమన్నారు. ఇది దేశ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. ఆర్టికల్-21 ప్రకారం మతం పేరుతో చదువులకు దూరం చేయడం నేరమని తెలిపారు. ఇందులో రాజకీయ కుట్ర ఉందని.. అందుకే కాషాయ మూకలు అల్లరి సృష్టిస్తున్నాయని విమర్శించారు. ఉడిపి ప్రాంతం మత సామరస్యానికి కేంద్రమని, మధ్వాచారుడు దగ్గరి నుంచి పెజావార్ స్వామి వరకు హిందు, ముస్లింలు ఎంతో సామరస్యంగా మెలిగారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక అక్కడి శాంతి వాతావరణానికి విఘాతం కలిగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వస్త్రధారణ అభ్యంతరమైతే రాజస్థానీ మహిళలు ముసుగు ధరించి ఉంటారనీ, నాగరిక కాలంలో నాగ సాధువులు, జైనులు దిగంబరులు నగ్నంగా నడయాడుతుంటారని, వారిని ఎవరూ ఏమీ అనడం లేదన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో అనేక ఆచార వ్యవహారాలు ఉన్నాయని, ఆదివాసీ, కోయ జాతులు పూర్తి బట్టలు వేసుకోకుండానే జీవిస్తారని తెలిపారు. సిక్కులు ఎప్పుడూ తలపాగాలు ధరించి ఉంటారని, అది వారి జీవన విధానమని అన్నారు. వీటిన్నింటికి లేని అభ్యంతరం హిజాబ్‌కు చెప్పడం అన్యాయమని, దీనిని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రవి, నగర నాయకులు దినేష్, మధు, శంకర్, అశోక్ రెడ్డి, పడాల శంకర్, అరవింద్, శశిధర్ పాల్గొన్నారు.

భాషగూడెం అడవుల్లో ఎదురుకాల్పులు

జవాను మృతి.. మరోకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పాతగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులకు.. పోలీసులకు మధ్య శనివారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో జవాన్ మృతిచెందారు. మరో జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా ఎస్పీ కమలోచన్ కస్యప్ తెలిపిన వివరాల ప్రకారం..

జిల్లాలోని బాషగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌కు ఆనుకుని ఉన్న పుట్కేల్ అడవుల్లో సీఆర్పీఎఫ్ 168 బెటాలియన్ జవాన్లు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌బీ టిర్కీ మృతిచెందారు. గాయపడిన మరో జవాన్‌ను మెరుగైన వైద్యం కోసం జగదల్పూర్ తరలించారు.

ఒఎన్‌జిసి లాభాల్లో ఏడు రెట్ల వృద్ధి

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద చమురు కంపెనీ ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఒఎన్‌జిసి) అత్యంత ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2021-22) అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఏడు రెట్ల వృద్ధితో రూ.8,764 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1,258 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో ప్రతీ బ్యారెల్‌పై 75.73 డాలర్లు (దాదాపు రూ.5600) ఆదాయాన్ని పొందింది. 2020-21 ఇదే క్యూలో ఈ ఆదాయం రూ.3200గా ఉంది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 67.3 శాతం పెరిగి రూ.28,474కు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది మాసాల్లో రూ.31,446 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే 2020 ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలంలో రూ.4,512 కోట్లుగా నమోదయ్యింది. తాజాగా ప్రతీ రూ.5 ముఖ విలువ కలిగిన షేర్‌పై 35 శాతం లేదా రూ.1.75 డివిడెండ్ చెల్లించడానికి ఒఎన్‌జిసి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ఇందుకోసం మొత్తంగా రూ.2,201.55 కోట్లు చెల్లించనుంది.

42 బొగ్గు గనుల వేలం : కేంద్రం

న్యూఢిల్లీ : వాణిజ్య మైనింగ్ కోసం దేశంలో ఇప్పటి వరకు 42 బొగ్గు గనులను వేలం వేశామని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మూడో దఫాలో భాగంగా ప్రస్తుత వారంలోనే 10 గనులను వేలం వేసినట్లు తెలిపింది. ఇవన్నీ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే విక్రయించినవి కావడం గమనార్హం. ఈ 42 బొగ్గు గనుల్లో ఏడాదికి 86,404 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని పేర్కొంది. ప్రస్తుత వారంలో విక్రయించిన 10 బ్లాక్‌ల ద్వారా ఏడాదికి రూ.2,858.20 కోట్ల రెవెన్యూ సమకూరనుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

అనీల్ అంబానీకి సెబీ షాక్

ట్రేడింగ్‌పై నిషేధం

ముంబయి : స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ చేయకుండా అనీల్ అంబానీపై రెగ్యూలేటరీ సంస్థ సెబీ నిషేధం ప్రకటిస్తూ ఆయనకు భారీ షాక్ ఇచ్చింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, దాని ప్రమోటర్ పారిశ్రామికవేత్త అనీల్ అంబానీలు సెక్యూరిటీల కొనుగోలు, అమ్మకం లేదా ఒప్పందాలు చేయడానికి వీలు లేదని స్పష్టం చేసింది. అనీల్‌తో పాటుగా మరో ముగ్గురు అమిత్ బప్నా, రవీంద్ర సుధాకర్, పింకేష్ ఆర్‌షాపై కూడా మూడ నెలల పాటు నిషేధించింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ నిబంధనలకు విరుద్ధంగా 13 సంస్థలకు నిధులను మళ్లించారనే ఆరోపణలతో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది.

ఎల్ఐసితో పాలసీబజార్ భాగస్వామ్యం

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని ఎల్ఐసితో పాలసీబజార్.కమ్ కీలక ఒప్పందం కుదర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ఎల్ఐసిలోని విస్తృత శ్రేణి టర్మ్, పెట్టుబడి ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో వినియోగదారులకు సులభంగా అందించనున్నట్లు పేర్కొంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఎల్ఐసి నార్త్ జోన్ జోనల్ హెడ్ దినేష్ భగ్, పాలసీబజార్.కమ్ సిఇఒ సర్బ్ వీర్ సింగ్‌తో పాటు ఇరు సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కరోనా సమయంలోనూ సాహితీ కార్యక్రమాలు : మామిడి హరికృష్ణ

ప్రజాశక్తి - కల్చరల్

కరోనా విపత్తు కాలంలో సాంస్కృతిక శాఖ కార్యక్రమాలు నిలుపు చేయలేదని, లాక్‌డౌన్ ప్రకటించిన పది రోజుల వ్యవధిలో ఆన్‌లైన్, జూమ్ ఇతర సామాజిక మాధ్యమాల వేదికగా 995 సాహితీ కార్యక్రమాలు నిర్వహించామని సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తెలిపారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో శనివారం కల్పన కళానికేతన్ నిర్వహణలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఘంటసాల శత జయంతి సభ జరిగింది. పలువురు యువ గాయనీ గాయకులు నాటి మధుర గీతాలను పాడి శ్రోతలను ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మామిడి హరికృష్ణ పాల్గొని కళాకారులను అభినందించారు. ప్రముఖ కవి డాక్టర్ రాము అధ్యక్షత జరిగిన సభలో సంస్థ అధ్యక్షులు జంగయ్య గౌడ్ స్వాగతం పలికారు.

విఐటిలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్‌పై మూడు రోజులపాటు నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఐటి ఎపివిశ్వవిద్యాలయంలో మూడు రోజుల రెండవ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్ (ఏఐఎస్‌పీ-22) అంతర్జాతీయ సదస్సు వర్చువల్ విధానంలో ప్రారంభమయ్యింది. ఈ సదస్సును ఐఈఈఈ గుంటూరు సబ్ సెక్షన్‌తో కలిసి, ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ ప్రెసిడెంట్ డేటా సెంటర్స్ మరియు ఏఐ గ్రూప్, ఇంటెల్ కార్పొరేషన్ శ్రీనివాస్ లింగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సిగ్నల్ ప్రాసెసింగ్‌లో తాజా పరిణామాలపై దృష్టి సారించటానికి విద్య, పరిశ్రమలకు చెందిన నిపుణులకు ఈ సదస్సు ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. గౌరవ అతిథి ప్రొఫెసర్, శాంతా క్లారా యూనివర్సిటీ , యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ప్రొఫెసర్ టోకున్‌బో ఒగున్‌ఫున్మీ మాట్లాడుతూ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, సిగ్నల్ ప్రాసెసింగ్ అంశంలో సృజనాత్మక పరిశోధన పాత్రలను ప్రచురించడానికి, అత్యాధునిక సాంకేతికత రూపకల్పన మరియు అభివృద్ధిలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, సిగ్నల్ ప్రాసెసింగ్ సిద్ధాంతం, రూపకల్పన, అమలు, విశ్లేషణ మరియు ధృవీకరణ, లేదా అనుభావిక మూల్యాంకనం, అప్లికేషన్‌లలో పురోగతిపై చర్చించటానికి ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ సదస్సులో ఏపీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా॥ ఎస్.వి. కోట రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సు 14వ తేదీ వరకు జరుగుతుందనీ, ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి, 12 దేశాల (చైనా, తైవాన్ , ఇథియోపియా, బ్రెజిల్, సౌదీ అరేబియా, అమెరికా, ఒమాన్, పోర్చుగల్, యు.ఏ.ఈ, బాంగ్లాదేశ్, మొరాకో) నుంచి అనేకమంది ప్రతినిధులు వర్చ్యువల్ గా హాజరవుతున్నారని తెలిపారు.

రైల్వే క్రాసింగ్ నిర్మాణాలపై సమగ్ర ప్రణాళిక

మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో రైల్వే క్రాసింగ్‌లపై చేపట్టాల్సిన నిర్మాణాల కోసం ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కె.తారకరామారావు అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలో జిహెచ్ఎంసి, దక్షిణ మధ్య రైల్వే, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆర్‌యూబి, ఆర్ఒబిల నిర్మాణానికి వెంటనే అనుమతులిస్తే ట్రాఫిక్ రద్దీ మరింత తగ్గే అవకాశముందని కెటిఆర్ అన్నారు. జిహెచ్ఎంసితో పోలిస్తే రైల్వే పనులు మందకొడిగా జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. దశాబ్దాల కింద నిర్మాణం చేసిన సికింద్రాబాద్‌లోని రామ్ గోపాల్‌పేట రైల్వే అండర్ బ్రిడ్జ్ వంటి వాటిని యుద్ధ ప్రాతిపదికన విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు నగర మేయర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర విభజన జరిగినా ఎపి, తెలంగాణ రాష్ట్రాల ప్రజల మధ్య ప్రేమాభిమానాలు ఏమాత్రం తగ్గలేదని కెటిఆర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఎపి మంత్రి బొత్సా సత్యన్నారాయణ కుమారుడు పెళ్లికి హాజరైన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ శనివారం ఆయన ట్వీట్ చేశారు.

పంపుసెట్లకు మీటర్లు పెడతామని చెప్పలేదు : బండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేసీఆర్ అవినీతి సామ్రాజ్య పతనం ప్రారంభమైంది. తన అవినీతిపై విచారణ ప్రారంభమైందని తెలిసే ఆయనలో భయం మొదలైంది. అందుకే మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చే కుట్ర చేస్తుండు' అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగం అమలు చేస్తామని చెప్పడానికే సభ పెట్టినట్టు, తాగి మాట్లాడినట్టు ఉందని విమర్శించారు. బహిరంగ సభలో తాము డ్రంకెన్ డ్రైవ్ చేస్తామనీ, తాగినట్టు తేలితే నేత్తల్నీ జైలుకు పంపేలా ఓ స్కీం తెస్తామని చురకలంటించారు. బోర్లకు కరెంటు మీటర్లు పెడతామని బిజెపి ఎక్కడా చెప్పలేదనీ, కేసీఆర్ అబద్దాలు ఆడుతున్నారని విమర్శించారు. డిస్కమ్‌లకు రూ.48 వేల కోట్ల అప్పు చెల్లించాలనీ, అవి కట్టకుండా, భవిష్యత్‌లో కరెంటు రాకపోతే బాధ్యులెవరు? అని ప్రశ్నించారు. డిస్కమ్‌లకు డబ్బులు కట్టకుండా తానే ఉచిత కరెంటు ఇస్తున్నట్టు గొప్పలు చెప్పుకోవడం దారుణమని విమర్శించారు. తెలంగాణ ధనిక రాష్ట్రమే కదా పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం తగ్గించాక రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఆ చర్యలకు పూనుకోలేదని ప్రశ్నించారు.

రాహుల్ బజాజ్ మృతికి సంతాపం

బజాజ్ గ్రూప్ మాజీ చైర్మెన్, పద్మభూషన్ రాహుల్ బజాజ్ మృతికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ సంతాపం తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాహుల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆటోమొబైల్ రంగంలో బజాజ్ స్కూటర్ తీసుకొచ్చి దేశ ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు.

ఘంటసాలను భారతరత్నగా గుర్తించాలి

ప్రజాశక్తి - కల్చరల్

వేలాది పాటలను పాడిన ఘంటసాల స్వాతంత్ర పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపారని, కేంద్ర ప్రభుత్వం ఆయన్ను భారతరత్న పురస్కారంతో గౌరవించాలని ప్రముఖులు కోరారు. న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్ నిర్వహణలో జూమ్ వేదికగా ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు నివాళులర్పిస్తూ మాట్లాడారు. సంగీత దర్శకుడు కోటి, నటుడు తనికెళ్ల భరణిలు మాట్లాడుతూ.. ఘంటసాల మరణించి మూడున్నర దశాబ్దాలు గడచినా ఆయన పాటలు నేటికీ గాయనీ గాయకులు పాడుతూ ఉపాధి పొందుతున్నారని వివరించారు. వంశీ రామరాజు మాట్లాడుతూ.. ఘంటసాలకు నివాళులు ఆయన జయంతి నుంచి వర్ధంతి వరకు పాటలతో జూమ్ వేదికగా నిర్వహించామని తెలిపారు. తెలుగుమల్లి స్థాపకులు కుంచాడ రావు, గోవర్ధన్ మల్లెల, అదిశేషు, శోభ వెన్నెలకంటి తదితరులు వివిధ దేశాల నుంచి మాట్లాడారు. ఘంటసాల కోడలు భారత నాట్య కళాకారిణి పార్వతి, కుమార్తె శ్యామల తదితరులు పాల్గొన్నారు. ఘంటసాల స్వతంత్ర సమరంలో పట్టుకొని ఊరేగిన జెండాను ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ ఘంటసాల మనుమడు చైతన్య ప్రదర్శించి జూమ్‌లో పాల్గొన్న వారికి ఆనందం కలిగించారు.

జిఒ 10 స్వాగతిస్తున్నాం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సిబ్బందికి పిఆర్‌సి అమలు చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ జిఒ నంబర్ 10 జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖలు కూడ